క్లుప్తంగా

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న సంతోష్

పరవాడ: జీవీఎంసీ 84 వార్డు సాలాపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సాలాపు సంతోష్ గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహార సరకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీను, అప్పలరాజు, నూకరాజు, సాలాపు రాజు, రామకృష్ణ, బాబూరావు, కృష్ణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



వెంకన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వెంకన్న కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని బలిజపాలెం శివారులో శుక్రవారం సాయంత్రం నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి నుంచి రూ.21,300 నగదుతో పాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏయూ క్యాంపస్: యువత తమ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవా రం ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండో రోజు విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ నైపుణ్యా లు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో పని చేస్తూ ఉన్నత భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ రాములు, డాక్టర్ జె.ప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- ఎన్టీపీసీ యాజమాన్యానికి సూచించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- కార్మికుల దీక్ష సంఘీభావం



ఎన్టీపీసీ యాజమాన్యంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పరిపాలన భవనానికి ర్యాలీగా వెళుతున్న కార్మికులు. నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు వివిధ యూనియన్ల మద్దతుతో రెండు రోజులుగా చేస్తున్న సమ్మెకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం డస్ట్ అలవెన్స్ రూ.2350 చెల్లించాలన్నారు. మెడికల్ టెస్ట్‌ల పేరుతో కార్మికులను వేధించడం ఆపి, ఎన్టీపీసీ లోగోతో కూడిన ఒకే రకమైన ఐడీ కార్డులు కార్మికులకు మంజూరు చేయాలని యాజమాన్యంతో చర్చించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలుస్తానని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కార్మిక వర్గానికి భరోసా ఇచ్చారు. అనంతరం ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, హెచ్‌ఆర్ ఏజీఎం రుమాడిశర్మతో సమావేశమై కార్మికుల సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బురద రాజు, బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, వెన్నల సన్యాసిరావు, వివిధ యూనియన్ల నాయకులు కార్మిక నేతలు మాసవరపు అప్పలనాయుడు, కె.శ్రీరామ్మూర్తి, కె.ఎం.శ్రీనివాస్, రామచంద్రరావు, బీఎంఎస్ ఎం.వి.ఎస్ నాయుడు, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

సబ్బవరం: షెడ్యూల్ కులాలు,తెగల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి పదోతరగతి వరకూ చదివే ఎస్సీ,ఎస్టీ బాలికలకు స్కాలర్ షిప్‌లు అందజేయనున్నట్లు కెనరా బ్యాంక్ సబ్బవరం శాఖ మేనేజర్ నుపూర్ చౌదరి తెలిపారు. సబ్బవరంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15 వతేదీ లోగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒక్కో తరగతికి ఒకరు చొప్పున 6గురు విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున స్కాలర్ షిప్ అందజేస్తామన్నారు.తల్లి లేదా తండ్రి లేనివారికి అధిక ప్రాధ్యాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా రూ.50 వేల విలువైన క్రీడా పరికరాలను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందజేయనున్నట్లు చెప్పారు.

త్వరితగతిన జగనన్న గృహాల నిర్మాణం

- అధికారులకు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశం
- కలపాకలో విస్తృత పర్యటన



కలపాక జగనన్న కాలనీలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్

పరవాడ: జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని కలపాక గ్రామంలో శుక్రవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తొలుత నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ వెంటనే సరఫరా చేసి ఇళ్లను సకాలంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులతో కాసేపు మాట్లాడారు. అదే గ్రామంలో నాడు-నేడులో అభివృద్ధి చేస్తున్న పాఠశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించిన రికార్డులను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సచివాలయాలనికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం కలపాక శివారు మూలస్వయంభూవరంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని మూలస్వయంభూవరం ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ పి.కనకారావు, సర్పంచ్ బొండా కనకారావు, ఈవోఆర్డీ పద్మజ, హౌసింగ్ ఏఈ ఎంఎస్ఎన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ జి.రామారావు, ఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి, పంచాయతీ కార్యదర్శి సుభాష్, వీఆర్వో భుజంగరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సబ్బవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తామన్నారు. దీనికోసం సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో 10 వేల మాత్రలు, గుల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో 4 వేల మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నెల 10వ తేదీన అందుబాటులో లేనివారికి మరో సారి ఈ నెల 17న ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని డాక్టర్ చక్రవర్తి తెలియజేశారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 77వ వార్డు మరడదాసరిపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలిసి ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులతో మాట్లాడారు. అన్ని పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం



బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల, ఎంపీపీ సూర్యకుమారి



పార్లుపాలెంలో వైఎస్సార్ పోషణ కిట్లు అందిస్తున్న ముమ్మన దేముడు

సబ్బవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పోషకాహారం అందిస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఇంటికే అందించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. అలాగే ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిపాల ఆవశ్యకతను, పౌష్టికాహారం అవసరాన్ని తల్లులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారత లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని తెలియజేసారు. సీఎ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నింటా మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

సింహాచలం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పార్లుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు. పుట్టిన గంట నుంచే బిడ్డకు తల్లిపాలు అందించడం శ్రేయస్కరమన్నారు. గర్భిణులు, బాలింతలు సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు.10 రకాల పోషక విలువలు కలిగిన కిట్లు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాపర్తి మాధవరావు, ఆకుల గుణాకర్, రాపర్తి కాశీ, పెదగాడి చిన్నారావు, కుంచా భార్గవ్, గొల్లవిల్లి తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్ క్విజ్ విజేతలకు అభినందన

ఏయూ క్యాంపస్: ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలోని డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మందికిపైగా విద్యార్థులు పోటీ పడ్డారు. ఏయూ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమ, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.భాస్కరరావు ద్వితీయ, ఏయూ సీఎస్‌ఈ విద్యార్థిని ఎం.హేమప్రేరణ తృతీయ బహుమతిని సాధించారు. విజేతలకు ఏయూ వీసీ తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, యు.అశోక్ హేమంత్, హరిత పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు సివిల్స్ శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్స్ వంటి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్ కళాశాల భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పలు గదులు ఖాళీగా ఉండటాన్ని గమనించారు. గతంలోనే ఈ గదులను ఖాళీ చేసి ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని సూచించినా ఎందుకు చేయలేదని విభాగాధిపతులను ప్రశ్నించారు. వెంటనే ఖాళీ గదులను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆర్ట్స్ కళాశాల మొదటి అంతస్తులో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా ఐఏఎస్ స్టడీ సెంటర్‌ను నెలకొల్పడానికి అనువుగా ఉంటుందని సూచించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు సూచించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవనానికి నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. భవనంలో టాయిలెట్స్ మరమ్మతులు, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లో వసతులు పెంచాలని చెప్పారు. టాయిలెట్స్ శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలన్నారు. త్వరలో భవనానికి పూర్తి స్థాయిలో పెయింటింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, ఆర్కిటెక్ భీమేష్, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడంలో విస్కా కృషి భేష్



సాంస్కృతిక విజయోత్సవాలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: సాహిత్యం, నృత్యం తదితర కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీ అన్నారు. విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక విజయోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాగ్చీ మాట్లాడుతూ నలభై ఏళ్ల పాటు అనేక కార్యక్రమాల ద్వారా కళాభిమానులను అలరించిన విస్కా భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. విస్కా అధ్యక్ష, కార్యదర్శులు నేమాని శ్రీనివాసశర్మ, ఎ.కేశవరావు మాట్లాడుతూ అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నాట్యోపాసన పురస్కార గ్రహీత డాక్టర్ లావణ్య శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎన్.ఎస్. రావు, లాస్య నృత్యాలయ స్థాపకురాలు డాక్టర్ లావణ్య, డి.ఆదినారాయణ, కళాక్షేత్రం కార్యదర్శి సత్యనారాయణ, విస్కా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.ఆర్. కిషోర్, డి. దుర్గాప్రసాద్, ఈరంకి శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

32వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపలి ఎల్లాజీ, మాద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల వైశిష్ట్యంపై ప్రసంగం



ప్రసంగిస్తున్న దేవులపల్లి పద్మజ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఉపనిషత్తుల వైశిష్ట్యంపై రచయిత్రి దేవులపల్లి పద్మజ ప్రసంగించారు. ముందుగా ముఖ్య అతిథి పూర్ణానంద స్వామి ఉపనిషత్తులను పరిచయం చేశారు. చివరిగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఉపనిషత్తులు వేదాంతమని, అనేత సత్యాలను, ఆత్మతత్వాన్ని లోకానికి రుషులు అందించారని ఉపదేశించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సారథ్యంలో వక్త పద్మజను సన్మానించారు.









